క్లుప్తంగా

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



ఓటు విధానంపై బుర్రకథతో వివరిస్తున్న చిన్నారులు

పెద్దాపురం: గ్రామీణాభివృద్ధిలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బందిది కీలక పాత్ర అని ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యాలయ సీనియర్ సహాయకులు జగన్నాథం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఓటరు అవగాహన కార్యక్రమంలో చిన్నారులచే ఓటు విధానంపై అవగాహన కల్పిస్తూ బుర్రకథ ప్రదర్శించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సామర్లకోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మౌనిక

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్సై మౌనిక అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని వాహనాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల వద్ద రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు తీసుకు వెళ్లడానికి వీలు లేదన్నారు. ఎక్కువ నగదు తీసుకు వెళ్లే సమయంలో ఆ నగదుకు సంబంధించిన రికార్డులు వెంట ఉండాలన్నారు. నగదు రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ఆరో రోజు ఒక్క నామినేషన్ మూడు సెట్ల దాఖలు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో రోజు బుధవారం నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటరి ్నంగ్ అధికారి జేఎస్ రామారావు తెలిపారు. సామర్లకోట పట్టణానికి చెందిన కేశవరపు రామ్మోహనరావు ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున నామినేషన్ మూడు సెట్లను దాఖలు చేశారన్నారు. ఇప్పటి వరకు టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప రెండు సెట్లు, నిమ్మకాయల రంగనాగ్ ఒక సెట్, బుంగా సత్యనారాయణ ఒకటి, శివకుమార్ రెండు సెట్లు, రామ్మోహనరావు నాలుగు సెట్లు దాఖలు చేయగా ఇప్పటి వరకు ఐదు నామినేషన్లు 10 సెట్లు దాఖలయ్యాయని ఆర్వో రామారావు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో శ్రీపుష్పయాగోత్సవం



మాండవ్యనారాయణస్వామికి నిర్వహిస్తున్న శ్రీపుష్ప యాగోత్సవం

సామర్లకోట: అతిపురాతన మాండవ్యనారాయణస్వామి శ్రీపుష్పయాగోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. బుధవారం రాత్రి స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పవళింపు సేవచేశారు. కటకం సతీష్ దంపతులు, బిక్కిన సాయి దంపతులు పాల్గొన్ని భక్తులకు సేవలందించారు.
ఆలయ పండితులు రఘురామ్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ నెల 18న ప్రారంభమైన కల్యాణోత్సవాలు బుధవారంతో ముగిసాయి.

పోస్టర్లను సీజ్ చేసిన అధికారులు



అధికారులు స్వాధీనం చేసుకున్న పోస్టర్లు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సాంబమూర్తి రిజర్వాయర్ వద్ద ఉన్న ఎస్ఎస్‌టీ చెక్కుపోస్టు వద్ద ఆ బృందం అధికారి వీరబాబు ఒక రాజకీయ పార్టీకి చెందిన పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా బుధవారం రాత్రి ఒక కారులో ఆంధ్ర పెన్షనర్ల పేరులో పోస్టర్లను గుర్తించారు. ఆ పోస్టర్లకు సంబంధించిన ఎటువంటి అనుమతులు, రికార్డు లేక పోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ పోస్టర్లపై చంద్రబాబు నాయుడు ఫొటోతో ముద్రించడం జరిగింది. ఈ తనిఖీలో ఎస్సై మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

దొరబాబు నామినేషన్‌కు ఊరూ వాడా సిద్ధం

- స్థానిక బలం చూపనున్న అభిమానులు
- పెద్ద ఎత్తున సమీకరణకు ఏర్పాట్లు



ఎన్నికల ప్రచారంలో దవులూరి దొరబాబు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలకు పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు గురువారం నామినేషన్ వేయడానికి ముహూర్తం సిద్ధం చేసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనతో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సుమారు 40 ఏళ్ల తరువాత స్థానిక అభ్యర్థిగా దవులూరి సిద్ధం కావడంతో పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలు నిర్ణయించారు. 1985లో తెలుగుదేశం అభ్యర్థిగా బలుసు రామారావు స్థానిక అభ్యర్థిగా చివరి సారి పోటీ చేసి ఎమ్మెల్యేగా సేవలందించారు. అప్పటి నుంచి నియోజకవర్గానికి చెందిన నాయకులకు ఆయా రాజకీయ పార్టీలు టిక్కెట్లు ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ నుంచి సామర్లకోట పట్టణానికి చెందిన దవులూరి దొరబాబుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వడంతో ఆయా రాజకీయ పార్టీలు స్థానికులకే టిక్కెట్లు ఇచ్చేలా తమ స్థానికత్వం నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు గురువారం నామినేషన్‌కు ప్రతి వార్డు, ప్రతి గ్రామం నుంచి తరలి వెళ్లి తమ మద్దతు తెలియజేయడానికి సిద్ధం అవుతున్నారు. రెండు మున్సిపాలిటీలో 60 వార్డులు, రెండు మండలాల్లోని 41 గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. 1952లో నియోజక వర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు లేని విధంగా జనంతో రోడ్లు నిండిపోయేలా నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు మున్సిపాలిటీల్లో 56 మంది కౌన్సిలర్లు, 41 గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉండ టంతో ఎవరికి వారే తమ బలం నిరూపణ చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

ప్రారంభం ఇలా.....

దవులూరి దొరబాబు నామినేషన్ వేయడానికి స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి భారీ ఎత్తున ర్యాలీ ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ కార్యాలయం నుంచి బడేలమ్మ చెరువు, నవదుర్గ ఆలయం, బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం మీదుగా పెద్దాపురం సుధా ప్యాక్టరీ, మహారాణి కళాశాల మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేయనున్నారు.

వాహనాల తనిఖీలో రూ.3.50 లక్షల స్వాధీనం



సామర్లకోట-కాకినాడ రోడ్డులో నగదు స్వాధీనం చేసుకున్న ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు అధికారులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో బుధవారం రూ.3.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. సామర్లకోట స్టేట్ బ్యాంకు వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎస్సై మౌనిక తనిఖీ చేయగా అతని వద్ద రూ.1.50 లక్షలు లభించడంతో విషయాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఆ అధికారి వై.శివరామకృష్ణయ్య తన సిబ్బందితో హుటాహుటిన ఘటన ప్రదేశానికి చేరుకుని మోటారు సైకిలు యజమాని తూమూరి వెంకటరమణ వద్ద ఉన్న నగదుకు రికార్డు లేక పోవడంతో స్వాధీనం చేసుకుని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపినట్టు శివరామకృష్ణయ్య తెలిపారు. డైలీ ఫైనాన్సులో భాగంగా ఒక పెళ్లి బృందానికి ఇవ్వడానికి నగదు తీసుకు వెళుతున్నట్లు వెంకటరమణ తెలిపారు. దానికి సంబంధించిన వివరాలు లేక పోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో సాంబమూర్తి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద టీము అధికారి కేవీఆర్ గుప్తా తనిఖీ చేసిన సమయంలో మోటారు సైకిల్ యజమాని వద్ద రూ.రెండు లక్షల నగదుకు రికార్డులు లేక పోవడంతో ఆ నగదు స్వాధీనం చేసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపినట్టు ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో వీఆర్వో రాంజీ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు



అనధికార లే అవుట్ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సుభాని

సాక్షి ఎఫెక్ట్

పెద్దాపురం: మండలంలోని జె.తిమ్మాపురంలో వెలసిన అనధికార లే అవుట్లపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ×యథేచ్ఛగా అక్రమ లే అవుట్‌*లు శీర్షికపై మండల, డివిజన్ స్థాయి పంచాయతీ రాజ్ అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాని అనధికార లే అవుట్‌లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎటువంటి అనుమతులు లేని స్థలాలను కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బంది పడవద్దని సూచించారు.

పిఠాపురంలో 19 నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న వంగా కాశీ విశ్వనాథ్

పిఠాపురం: పిఠాపురం అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఇప్పటివరకూ 11 మంది అభ్యర్థులు, 19 నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలి మూడురోజులు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంతో అధికారులు ఖాళీగా ఉన్నారు. అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుని నామినేషన్లు వేయడం ప్రారంభించారు. గురువారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుండడంతో గతమూడు రోజుల్లో 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకూ వైఎస్సార్ సీపీ నుంచి వంగా గీత, వంగా కాశీ విశ్వనాథ్, జనసేన నుంచి పవన్ కల్యాణ్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి జగ్గారపు మల్లికార్జున, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మద్దురి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి మాదేపల్లి సత్యారావు, స్వతంత్ర అభ్యర్థులుగా మొగలి లక్ష్మణమూర్తి, ఈటీ జగదీష్, పైండా వీరప్రభాకరరావు, బోలిశెట్టి గౌరీమణి తమ నామినేషన్లను దాఖలు చేశారు.

ఎన్నికల పరిశీలకులను కలసిన కలెక్టర్, ఎస్పీ



ఎన్నికల పరిశీలకుడు గణేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఎన్నికల పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, జేసీ రామ్ సుందరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్ కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని, పిఠాపురం, కాకినాడ పట్టణం అసెంబ్లీ నియోజవర్గాలు, రాజేష్ జోగ్‌పాల్ ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యవేక్షిస్తారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు



సామర్లకోట బల్లమార్కెట్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ రామారావు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ జగన్మోహన శ్రీనివాస్

సామర్లకోట: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరు ఆదేశాల మేరకు బుధవారం చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక బల్లమార్కెట్, బ్రౌన్‌పేట సెంటర్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ప్రారంభించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా స్టేషన్ బ్యాంకు ఎదురుగా అంబటి సుబ్బన్న అయిల్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సింగవరపు సత్యనారాయణ, కర్రి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాణి సత్రం ఆధ్వర్యంలో

పెద్దాపురం: స్థానిక మహారాణి సత్రం కార్యాలయం వద్ద బుధవారం సత్రం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

- మండుటెండలో చెత్తను కాలుస్తున్న వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



దివిలి ప్రధాన రహదారిపై చెత్తకు నిప్పు పెట్టడంతో కమ్ముకున్న పొగ



కలుషిత పొగలో వాహనాల రాకపోకలు

పెద్దాపురం: గ్రామ పొలిమేరలు.. వీధుల్లో.. చెత్త నిర్జన ప్రదేశానికి తరలించకపోవడంతో అవి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఆ చెత్తకుప్పలపై అగ్గి రగిలించడంతో వచ్చే దట్టమైన పొగ స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రశాంతతకు, స్వచ్ఛతకు మారు పేరైన పల్లె సీమలు రోజుల తరబడి తొలగించని చెత్త కొండల్లా పేరుకుపోవడం, వాటికి నిప్పు పెట్టడంతో కలుషితమవుతున్నాయి. మండలంలో ప్రతి గ్రామం, ప్రతీ వార్డు, ప్రతి వీధిలో రోజు రోజుకూ చెత్త పెరిగిపోతోంది. పలు ప్రాంతాల్లోనూ ప్రధాన రహదారుల్లోనూ, వీధుల్లో రోడ్డు పక్కనే చెత్తను గుట్టలు గుట్టలుగా పోసేస్తున్నారు. దీంతో వీధులన్నీ దాదాపు డంప్ యార్డులను తయారుచేస్తున్నాయి. ప్రధాన రహదారులు వెళ్లే రోడ్డులో చెత్త కుప్పలే స్వాగతం పలుకుతాయి.

నిప్పుతోనే ముప్పు

వీధుల్లో, రహదారుల పక్కన పేరుకుపోతున్న చెత్తవల్ల ఎదురెదురు వాహనాలు కూడా దాటుకుని వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. పలుచోట్ల ఈ చెత్తకు స్థానికులు నిప్పు పెడుతుండడంతో గంటలు, రోజుల తరబడి దహనం అవుతుండడంతో సమీప ప్రాంతాల్లో పొగ కమ్మేయడంతో స్థానికంగా నివసిస్తున్నవారే మళ్లీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మండుటెండలో నిప్పు

మండలంలోని దివిలి ప్రధాన రహదారిలో చెత్తకుప్పకు నిప్పంటించడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వీస్తున్న వేసవి గాలుల నేపథ్యంతో వాటికి మంట పెట్టేటపుడు వచ్చే మరింత వేడి గాలులు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని, కాలుష్యాన్ని నివారించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> గ్రామాల్లో చెత్తకుప్పలకు నిప్పు పెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతోంది. నివాస ప్రాంతాల సమీపంలో చెత్తకు నిప్పు పెట్టరాదని, గ్రామానికి దూరంగా, నిర్జన ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశిస్తాం.
>
> –జి.ఉషారాణి, ఎంపీడీఓ పెద్దాపురం మండలం

పోలింగ్ శాతం పెంచడమే స్వీప్ లక్ష్యం

- ఆర్ఓ జేఎస్ రామారావు



స్వీప్ అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఓ రామారావు, ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. (ఎంసీసీ) కన్వీనర్, ఎంపీడీఓ మాదిరెడ్డి ఉషారాణి ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ రాజ్ సిబ్బందిచే ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మోటారు బైక్ ర్యాలీని రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్ఓ రామారావు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 79.77 శాతం పోలింగ్ నమోదు కాగా జాతీయ స్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఓటు అనే వజ్రాయుధంతో ప్రతీ పౌరుడు తమ ఓటు ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ ఎన్నికల పోలింగ్‌లో భాగస్వాములై పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ జి.రాగంపేట వరకు సిబ్బంది మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణమూర్తి, సీనియర్ సహాయకులు జగన్నాథం, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు, కుంకుమ ప్యాకెట్లతో నూకాలమ్మతల్లి అలంకరణ



పసుపు, కుంకుమ ప్యాకెట్ల అలంకరణలో నూకాలమ్మ తల్లి

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో గ్రామదేవత నూకాలమ్మ తల్లిని బుధవారం పసుపు కుంకుమలతో అలంకరించారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యులు ఈ అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన పసుపు, కుంకుమను ప్యాకెట్లుగా తయారు చేసి అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలచే సామూహిక పూజలు, పారాయణలు చేశారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొమ్మాలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి సత్యనారాయణ, పారాయణ కమిటీ నాయకురాలు సత్తి అరుణ భక్తులకు సేవలందించారు.
సాయంత్రం ఆలయ అర్చకులు ప్రవీణకుమార్ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో వివిధ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు బుధవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారి రాజీనామాలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవలను ప్రతిపక్షాలు తప్పుగా ప్రచారం చేయడంతో పాటు పేదలకు సేవలు చేసే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు తమను నేరస్తులుగా చిత్రీకరించడం, ఇతరులతో మాట్లాడే అవకాశం లేకుండా చేయడంతో రాజీనామాలు చేశామని చెప్పారు. ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పే విధంగా వైఎస్సార్ సీపీ విజయం కోసం తాము పని చేస్తామని తెలిపారు.

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు బుధవారం స్వచ్ఛందగా రాజీనామా చేశారు. మండలంలోని నాగులపల్లిలో ఒకరు, ఇసుకపల్లిలో ముగ్గురు, పోన్నాడలో ఇద్దరు, వాకతిప్పలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

తాటి ముంజెలకు భలే గిరాకీ



తాటిముంజెలు విక్రయిస్తున్న వ్యాపారి

కొత్తపల్లి: ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలతో పాటు ఆరోగ్య ప్రదాయిని అయిన తాటి ముంజెలను ఎక్కువగా తీసుకుంటున్నారు. తాటి ముంజెలు వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు వీటిలో అధిక పోషకాలు ఉండడంతో కొనుగోలు చేసేందుకు జనం ఎంతో ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తాటి చెట్లు ఉన్నాయి. గ్రామాల్లోని కొందరు కూలీలు, గీత కార్మికులు చెట్ల నుంచి వీటిని కోసి వ్యయ, ప్రయాసలతో ఆటోల్లో తీసుకుచ్చి ప్రధాన రహదారుల్లో విక్రయిస్తున్నారు. తాటి ముంజెలు డజన్ రూ.100, అరడజన్ రూ.50కి విక్రయిస్తున్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్, పిఠాపురం రోడ్డులో తాటి ముంజెలు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

వైభవంగా శృంగార వల్లభుని శ్రీపుష్పోత్సవం



శ్రీ పుష్పయాగానికి హాజరైన భక్తులు



శృంగార వల్లభుడికి శ్రీ పుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీ పుష్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ, భూ సమేత శృంగార వల్లభుడు ప్రత్యేక అలకంరణలో దర్శనమివ్వగా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, చైర్మన్ కర్రి జగదీష్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి శ్రీపుష్పోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలకరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



సీతారాములకు శ్రీపుష్పయోగం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై రామాలయంలో సీతారాములకు బుధవారం శ్రీపుష్పయాగం నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా రాత్రి 7.30 గంటలకు నవదంపతులు సీతారాములను, పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనాలపై ప్రతిష్ఠించి పండితులు విశేష పూజలు చేశారు. అనంతరం సీతారాములను పలురకాల పుష్పాలతో పూజించారు. సీతారాములకు వివిధ రకాల పిండివంటలు నివేదించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ఊయల మీద సీతారాములను పవలింపు చేసి వేద మంత్రాల నడుమ మూడుసార్లు ఊపారు. ఊయలకు అమర్చిన అద్దంలో సీతారాములను పండితులు దర్శించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు సీతారాములను అద్దంలో తిలకించి పులకించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, కోట సుబ్రహ్మణ్యం, సుధీర్, దత్తాత్రేయ శర్మ తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కాగా శ్రీపుష్పయాగంతో రత్నగిరిపై శ్రీరామ నవమి మహోత్సవాలు ముగిశాయి.